# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



- వ్యవసాయాన్ని నాశనం చేసేలా పీసీసీ చీఫ్ వ్యాఖ్యలు
- మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లపై రైతుల మండిపాటు
- కాంగ్రెస్ హయాంలో పడ్డ గోసలు మర్చిపోలేమంటున్న అన్నదాతలు
- తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటెయ్యం.. భూముల్ని బీడు చేసుకోబోమని ప్రతిన
- పచ్చనిపొలాలు కేసీఆర్‌తోనే సాధ్యం.. ఆయనే మా ధైర్యం

# ఆగం కావొద్దు..

## హస్తాన్ని మాయం చేద్దాం..

**పూటకో మాట** మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతల అసలు రంగు బయటపడింది. పదేండ్లలో పచ్చబడ్డ తెలంగాణను.. రైతుల ముఖాల్లోని నవ్వును దూరం చేసే కుట్రలు బహిర్గతం అయ్యాయి. అధికారం దక్కించుకోవాలనే అత్యాశతో నోటికి ఏది వస్తే.. అది మాట్లాడుతూ అన్నదాతలను ఆగం చేయాలని చూస్తున్నారు. ఎవుసం ఎరుకలేని నాయకులంతా కలిసి రైతుకు కొత్తగా వ్యవసాయ పాఠాలు బోధించేలా ఉన్నారు. సాక్షాత్తు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పొలానికి నీళ్లు పారించాలంటే మూడు గంటల కరెంటు సరిపోతుందని రైతులపై ఉన్న అక్కసును వెళ్లగక్కారు. అది సాధ్యం కాదని తెలుసుకొని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని రైతులకు ఉచిత సలహా ఇచ్చారు. అసలు మూడు గంటల కరెంటు రైతులకు సరిపోతుందా? 10హెచ్‌పీ మోటర్లు వ్యవసాయ బోర్లకు వాడతారా? అనే విషయం ఆయనకు ఇసుమంతైనా తెలుసా? అని రైతన్నలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్‌కు తప్పిదారి ఓటేస్తే రైతులను ఆగం చేసేలా ఉన్నాయి నాయకుల మాటలు. ఇదంతా గమనిస్తున్న రైతాంగం.. కాంగ్రెసోళ్లకు ఓటేసేదీ లేదు.. వాళ్లకు అధికారం ఇచ్చేది లేదని అభిప్రాయపడుతున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో బీడుభూములన్నీ పచ్చగా కళకళలాడుతుండడానికి ప్రధాన కారణం 24గంటల ఉచిత కరెంటు. వ్యవసాయం బాగైంది.. రైతు కూడా బాగుపడుతున్నాడు. దీనంతటికీ సీఎం కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మక చర్యలేనని రైతులు సంతోషంగా చెబుతున్నారు. రైతులకు ఎన్నో సౌలత్‌లు ఇచ్చిన కేసీఆర్‌ను కాదని ఎవరికీ ఓటు వెయ్యమని తేల్చిచెబుతున్నారు. రైతులంతా ఆగం కాకుండా.. సీఎం కేసీఆర్‌కు ఓటేసి రైతు రాజ్యానికి పాటుపడతామని ప్రతినబూనారు.







### కాంగ్రెస్‌కు ఓటేసి బాధలు పడాల్నా...



కాంగ్రెస్ పాలనలో బాయి, బోర్లకు మోటర్లు పెడితే ఎకరం పొలం కూడా పారలేదు. రాత్రిపూట కరెంట్ ఇచ్చేటోళ్లు. నెలకోసారి మోటర్లు కాలిపోతుండే. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ రైతు గోస చూసి 24గంటల కరెంట్ ఇస్తున్నాడు. సీఎం కేసీఆర్ రైతును రాజు చేయడం కోసం కృషిచేస్తున్నాడు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ సక్కగా రాదు. ఎవుసం బంద్ పెట్టుకోవాలి. మళ్లీ పాతకాలం నాటి బాధలు పడాల్సి వస్తది. అందుకే కాంగ్రెస్‌ను రానివ్వం.

**- మహంకాళి, రైతు, బీబీపేట్**



### 10 హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు ఉంటాయా..

మన దగ్గర 5హెచ్‌పీ మోటర్లు అయితే మస్తు అయితది. కాంగ్రెసో ళ్లు మూడు గంటలు కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుమంటున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు ఉంటాయా? రైతును ముంచాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నది. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులకు కష్టాలు తప్పువు. సంక్షేమం గురిం చి ఆలోచించే సీఎం కేసీఆర్‌ను గెలిపించుకుంటే రైతులకు కష్టాలు ఉండవు.

**- గోసానిపల్లి నర్సింలు, రైతు, దోమకొండ**



### ఆ మోటరు పెడితే భూమిలో నీళ్లుంటాయా...

సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత కరెంట్ కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. ఎన్నో పార్టీలు వచ్చాయి. పోయాయి. గిప్పుడు జర్ర మంచిగా జరుగుతుంది. మళ్లీ కాంగ్రెసోళ్లు ఒక్కసారి అవకాశం ఇవ్వమంటున్నారు. జర్ర ఆలోచన చేయాలి. 3గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్ పెడితే భూమిలో ఎన్ని నీళ్లు ఉంటయ్. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే చీకటి రాజ్యం వస్తుంది. సీఎం కేసీఆర్‌తోనే రైతులు నిమ్మలంగా ఉన్నారు.

**- బాల్‌రాజ్, రైతు, బీబీపేట్**

### రైతుబిడ్డవైతే తెలిసేది రేవంతం..



కాంగ్రెస్ నాయకుడా రేవంత్ రెడ్డి నువ్వు కానీ, నీ కుటుంబంలో ఎవరైనా వ్యవసాయం చేస్తే తెలిసేది మూడు గంటల కరెంట్ చాల్తదా..లేదా అనేది.. ఒక ఎకరానికి ఎన్ని గంటల కరెంటు కాల్తదనే సంగతి మొదట తెలుసుకో. పల్లెటూర్లలో ఎక్కువ శాతం 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు వాడుతారు. నీ మూడు గంటల కరెంట్ కోసం 10హెచ్‌పీ మోటర్లు ఎక్కడ నుంచి తేవాలే. ఏం తాకట్టుపెట్టుకోవాలే.. ఏం అమ్ముకోవాలె. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రైతులందరివీ మళ్లీ పాత బతుకులే అయితాయి. ఎప్పుడు కరెంట్ వస్తుందో తెలియదు. వచ్చే కరెంట్‌తో పొలం పారుతుందో లేదో తెలియదు. ఇంత కాలం ఆగిన రైతు ఆత్మహత్యలు మళ్లీ మొదలు పెడదామనుకుంటున్నారా.. సీఎం కేసీఆర్ ఇచ్చిన 24గంటల కరెంట్‌తో మా పొలాలు పుష్కలంగా పారుతున్నాయి. కంటి నిండా నిద్రపోతున్నాం. మాకు మళ్లీ కేసీఆర్ సారే ముఖ్యమంత్రిగా రావాలే.. ఆయన పార్టీ గెలవాలి.

**- మధుసూదన్‌రెడ్డి, రైతు, మాందాపూర్**

### ఇప్పుడే కరెంట్ మంచిగిస్తున్నారు.



కాంగ్రెస్ నాయకుల మాటాలు అన్ని ఝూటా మాటలే. రైతులకు మూడు గంటలు కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి చిల్లరగా మాట్లాడడం సరి కాదు. 10హెచ్‌పీ మోటర్‌తో 3గంటల్లో పొలానికి నీరు పారిచ్చుకోవచ్చని చెప్పడం అవివేకం. రేవంత్‌రెడ్డి వ్యవసాయం చేస్తే తెలిసేది. ఎన్నిగంటల్లో ఎన్ని ఎకరాలు పారుతుందని. 10హెచ్‌పీ మోటర్లు వ్యవసాయనికి వాడతారో లేదో తెలియని పరిస్థితి కాంగ్రెస్ నాయకులది.

**-వెల్మ సంజీవారెడ్డి, రైతు, ఆరెపల్లి, పాల్వంచ మండలం**

### వాళ్లకు ఎవుసం ఎరుకనేనా?



వ్యవసాయంపై కాంగ్రెస్ లీడర్లు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. 10హెచ్‌పీ మోటర్‌తో నీటిని తీస్తే భూగర్భ జలాలు ఎండిపోతాయి. 3, 5హెచ్‌పీ మోటర్లను ఎవుసానికి వాడుకుంటాం. 24 గంటల ఉచిత విద్యుత్‌తో రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేదు. రేవంత్ రెడ్డి మాత్రం మూడు గంటలు కరెంట్ ఇచ్చి 10హెచ్‌పీ మోటర్లతో నీటిని పంట చేన్లకు వదలాలని సూచించడం విడ్డూరం. ఆయనకు ఎవుసం ఎరుకనేనా?

**- లోయపల్లి శ్రీధర్‌రావు, రైతు, గజ్యానాయక్‌తండా, మాచారెడ్డి మండలం.**

### రైతులు బాగుండాలంటే కేసీఆర్ ఉండాలి..

రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్. రైతులకు ఏం చేస్తే మంచి జరుగుతుందో ఆయనకు తెలుసు. రైతుల కోసం 24గంటల కరెంట్ ఇచ్చిండు. పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. కష్టాల ఊబి నుంచి బయటికి వచ్చిన రైతును కాంగ్రెసోళ్లు వచ్చి మళ్లీ కష్టాల పాలు చేసేందుకు చూస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియదు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోదు. కేసీఆర్ అందిస్తున్న నాణ్యమైన 24గంటల కరెంటే సరిపోతుంది. కేసీఆర్‌ను గెలిపించుకుంటేనే రైతులకు కష్టాలు రావు.

**- దోమకొండ బాబు, రైతు, దోమకొండ**



### 10హెచ్‌పీ మోటరంటే సాధ్యమయ్యే పనికాదు

ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24గంటల కరెంట్‌తో పంటలు మంచిగా పడించుకుంటున్నాం. గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు కరెంట్ మంచిగ ఇయ్యకుండే. ఇప్పుడు కాంగ్రెసోళ్లు మూడు గంటలు చాలని అంటున్నారు. 10హెచ్‌పీ మోటర్‌తో పొలాన్ని రెండు,మూడు గంటల్లో తడపవచ్చని అంటున్నారు. ఇది సాధ్యం కాని పని. ఎందుకంటే వ్యవసాయ బోర్లకు 3 లేదా 5 హెచ్‌పీ మోటర్లనే వాడతారు. 10హెచ్‌పీ మోటర్లతో నీటిని గుంజితే ఒక్కసారిగా బోర్లల్లో నీళ్లు ఇంకిపోయే ప్రమాదం ఉన్నది. 10హెచ్‌పీ మోటరు విలువ ప్రస్తుతం మార్కెట్‌లో రూ.70వేల నుంచి లక్షవరకు ఉన్నది. ఇది రైతులతో సాధ్యమయ్యే పనికాదు.

**- ఆశన్నగారి రమేశ్, రైతు, భవానీపేట,పాల్వంచ మండలం.**





### కేసీఆర్‌తోనే సంతోషంగా ఉన్నాం..

ఇప్పుడు సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంట్ మాకు సరిపోతుంది. బోర్లపై ఆధారపడే రైతులందరూ కేసీఆర్ ఇస్తున్న కరెంట్‌తో సంతోషంగా ఉన్నారు. కాంగ్రెసోళ్లు వచ్చి 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. ఇప్పుడు ఆ మోటర్లు రైతులకు అవసరం లేదు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతుల బతుకు కచ్చితంగా ఆగమవ్వడం ఖాయం. సీఎం కేసీఆర్‌ను గెలిపించుకొని రైతులందరం సంతోషంగా ఉందాం.

**- కంశెట్టి నర్సింలు,రైతు, దోమకొండ**



### కాంగ్రెస్‌తోనే కష్టాలు

బీఆర్‌ఎస్ హయాంలో వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇవ్వడంతో పంటలు పుష్కలంగా పండుతున్నాయి. తెలంగాణ వచ్చిన తర్వాతే రైతుల కష్టాలు తీరాయి. రైతులు సంతోషంగా ఉన్నారనే కక్షతో కాంగ్రెసోళ్లు మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారు. రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుందని అనడం అందుకు నిదర్శనం. రైతులకు మళ్లీ కష్టాలు రావొద్దని అనుకుంటే సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాలి.

**- సంఘం రాజు, రైతు, దోమకొండ**

### 10 హెచ్‌పీ మోటర్లకు ఎక్కడికి పోవాలే...



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తా అంటే మొదటికే మోసం వస్తుంది. మూడు గంటల కరెంటు పంటలు పండించేందుకు సరిపోదు. సన్న, చిన్నకారు రైతులందరి వద్ద చాలా వరకు 2హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు ఉన్నాయి. 10హెచ్‌పీ మోటర్లకు ఎక్కడి పోవాలె. ఏం తాకట్టు పెట్టుకోవాలె. మూడు గంటల కరెంటు ఇస్తే ఒకేసారి రైతులు స్టార్ట్ చేస్తే మోటర్లు కాలిపోవడం ఖాయం. అలా కాకుండా కేసీఆర్ సారు ఇచ్చే 24గంటల కరెంట్‌తో ఎప్పుడు కావాలంటే అప్పుడు మోటర్లను స్టార్ట్ చేసి నీళ్లు పారిస్తున్నాం.

**- బాపురెడ్డి, రైతు, యాడారం**



### మూడు గంటలు కరెంట్‌తో ఎవుసం ఎట్ల జేస్తం

మూడు గంటల కరెంట్ ఇస్తే ఎవుసం ఎట్ల జేస్తం. 50 ఏండ్ల కాంగ్రెస్ హయాంలో ఎంత కరెంట్ ఇచ్చింండ్రు. అప్పుడు కరెంట్ సక్కగా ఇస్తే మా బతుకులు ఇలా ఎందుకు అయ్యేవి. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలతోనే రైతుల చేతుల్లో పైసలు లేక ఇబ్బంది పడ్డాం. సీఎం కేసీఆర్ వచ్చినంకానే గీ పదేండ్ల నుంచి మంచిగా వ్యవసాయం చేసుకుంటున్నాం. మమ్మల్ని ఇలాగే బతకనివ్వండి. మళ్లీ కాంగ్రెసోళ్లు వచ్చి చేసేదేమీ లేదు.

**-ఎర్రోల వేణు, రైతు మాచారెడ్డి**

### నోటికొచ్చినట్లు మాట్లాడకు రేవంత్..

వ్యవసాయానికి మూడు గంటల కరెంటు ఇస్తాం. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోండి అని నోటికొచ్చినట్లు మాట్లాడకు రేవంత్ రెడ్డి. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కరెంటు సరిగ్గా ఇవ్వకపోవడంతో అక్కడి రైతులు కష్టాలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 5గంటల కరెంట్ ఇస్తామని చెప్తున్నా అది సరిపోక రైతులు ఇబ్బందులకు గురవుతుంటే.. ఇక్కడ రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంట్ చాలంటూ నోటికొచ్చినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉన్నది. జనానికి ఉపయోగపడే మాటలు మాట్లాడాలి.

**- దేవునిపల్లి రాజయ్య, రైతు, బీబీపేట్**



### కరెంట్ షాక్ కొట్టే రోజులు రావొద్దు..

కాంగ్రెస్ హయాంలో కరెంట్ సరిగ్గా రాక రాత్రిపూట పొలం కాడికి పోయి మోటర్లు చాలుజేసేటోళ్లం. పొలానికి నీళ్లు పెట్టేందుకు అరగంటకు ఒకసారి లేచి చూసేటోడిని. లోవోల్టేజీతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండే. రిపేర్ చేసుకొని వచ్చేసరికి పంట ఎండిపోతుండే. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 24గంటలు కరెంట్ ఇస్తూ రైతులకు అండదండగా నిలుస్తుండు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోం.

**-గడ్డం ఎల్లారెడ్డి,రైతు ఆరెపల్లి పాల్వంచ మండలం**





### మూడు గంటల కరెంటుతో మళ్లీ గోసనే..

సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంట్ అవసరం. 3గంటల కరెంట్ తీసుకువస్తే మళ్లీ రైతులకు గోస. 10హెచ్‌పీ మోటర్లు పెడితే నీరుకాకుండా దుమ్మువస్తుంది. రైతుల కష్టాలు తెలిసి సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి రైతులు ఇబ్బందులుపడొద్దు. ప్రశాంతంగా పంటలు పండించుకోవాలంటే సీఎం కేసీఆరే మళ్లీ రావాలి.

**- బుర్రి రవి, రైతు, దోమకొండ**